నమ్మలేని నిజాలు

కొరడ శిక్ష
మార్పుకు నిరసన
తమిళ నేత

ఘనస్వాగతం
నూతన ఏడాదికి
రాశుల ఫలం

కొత్త నియమం
తాగి బండితోలితే
రోడు ఊడ్చాలి

కొత్త పంచాంగం
ఆంగ్లనామ వత్సరం
ముందే పచ్చడి

సాగితే మసి
ఆయుధాల గర్జన
ఆగితే కుషి.

- రేడియమ్
సెల్: 9291527757



# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

శ్రీనిజాలు

కొత్త ట్రెండు మొదలైతే
సంక్రాంతికి సంబరాలు !
పందేలకు సిద్ధమైతె
కోట్లు దాటు అంబరాలు !
చూసొద్దామని వెళితే
తెలంగాణా నివాసులు !
పందేలలో పాల్గొంటె
పోగొట్టుకొనుడె కాసులు !

- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245



హైదరాబాద్ గురువారం 16-1-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :31 సంచిక:124 పేజీలు:6 వెల: రూ.1/-


## భారత వాయుసేన అమ్ములపొదిలోకి మరో మూడు యుద్ధనౌకలు

యుద్ధనౌకలను ముంబైలోని నేవల్ డాక్‌యార్డ్‌లో ప్రారంభించిన ప్రధాని మోదీ



ముంబాయ్ జనవరి 15 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );;భారత వాయుసేన అమ్ములపొదిలోకి మరో మూడు యుద్ధనౌకలు వచ్చి చేరాయి. అధునాతన ఐఎన్ఎస్ సూరత్ ఐఎన్ఎస్ నీలగిరి ఐఎన్ఎస్ వాఘ్‌షీర్ యుద్ధనౌకలను ముంబైలోని నేవల్ డాక్‌యార్డ్‌లో ప్రధాని మోదీ వీటిని ప్రారంభించారు.

అనంతరం మూడు నౌకలను జాతికి అంకితం చేశారు. ఇలా ఒకేసారి మూడు యుద్ధ నౌకలను ప్రారంభించడం దేశ చరిత్రలో ఇదే తొలిసారి. వీటి రాకతో నేవీ బలం పెరుగనుంది.యుద్ధ నౌకలు భారత సైన్యానికి మరింత శక్తినిస్తాయని మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. రక్షణరంగంలో మేకిన్ ఇండియా ఆవిష్కృతమవుతోందన్నారు. ప్రపంచంలో బలమైనశక్తిగా భారత్ మారుతోందని వ్యాఖ్యానించారు.

### దేశీయ విధానంలోయుద్ధనౌకల విశేషాలు..

ఐఎన్ఎస్ సూరత్.. ఇది పీ15బి గైడెడ్ మిస్సైల్ డిస్ట్రాయర్ ప్రాజెక్ట్ కింద అభివృద్ధి చేసిన నాలుగో యుద్ధనౌక. ప్రపంచంలోనే అతిపెద్ద, అత్యంత అధునాతన డిస్ట్రాయర్ వార్‌షిప్‌లలో ఒకటి. దీనిని 75 శాతం స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేశారు. ఇందులో అత్యాధునిక ఆయుధాలు, సెన్సార్ ప్యాకేజీలు, అధునాతన నెట్‌వర్క్-సెంట్రిక్ సామర్థ్యాలు ఉన్నాయి.

ఐఎన్ఎస్ నీలగిరి.. పీ17ఏ స్టెల్త్ ఫ్రిగేట్ ప్రాజెక్ట్ మొదటి నౌక. దీనిని శత్రువును ఏమార్చే స్టెల్త్ పరిజ్ఞానంతో ఇండియన్ నేవీకి చెందిన వార్‌షిప్ డిజైన్ బ్యూరో రూపొందించింది. సముద్రంలో ఎక్కువసేపు ఉండటం దీని సామర్థ్యం. అలాగే ఇందులో అధునాతన టెక్నాలజీతో రూపొందించారు. ఇది తరువాతి తరం స్వదేశీ యుద్ధనౌకలను సూచిస్తుంది.

ఐఎన్ఎస్ వాఘ్‌షీర్.. పీ75 స్కార్పెన్ ప్రాజెక్టులో భాగంగా రూపొందిస్తున్న ఆరో, చివరి జలాంతర్గామి. జలాంతర్గామి నిర్మాణంలో ఫ్రాన్స్‌కు చెందిన నేవల్ గ్రూప్ భాగస్వామ్యమైంది. సముద్ర భద్రతలో ఈ యుద్ధనౌక కీలకం కానున్నది.యుద్ధనౌకల తయారీ గర్వకారణమన్నారు.

## ఉత్తర భారతదేశంలో పెరిగిన చలి తీవ్రత

**-చలి పెరగడంతో ఆయా ప్రాంతాలను కమ్మేసిన దట్టమైన పొగమంచు**

**- దేశ రాజధాని ఢిల్లీలో కనిష్ట ఉష్ణోగ్రతలు 6 డిగ్రీల సెల్సియస్‌గా నమోదు**

న్యూ ఢిల్లీ జనవరి 15 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ఉత్తర భారతదేశంలో చలి తీవ్రత పెరిగింది. దేశ రాజధాని ఢిల్లీ సహా పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఉత్తరాఖండ్, బీహార్ సహా ఉత్తరాది రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు దారుణంగా పడిపోయాయి. దీంతో చలి తీవ్రతకు ప్రజలు గజగజ వణికిపోతున్నారు. చలి పెరగడంతో ఆయా ప్రాంతాలను దట్టమైన పొగమంచు కమ్మేసింది.దేశ రాజధాని ఢిల్లీలో బుధవారం కనిష్ట ఉష్ణోగ్రతలు 6 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యాయి. ఉష్ణోగ్రతలు పడిపోవడంతో ఢిల్లీ ? ఎన్సీఆర్ ప్రాంతాల్లో దృశ్యమానత అధ్వాన్నస్థితికి చేరింది. పలు ఏరియాల్లో విజిబిలిటీ జీరోకు పడిపోయింది. రోడ్డుపై ముందు వెళు న్న వాహనాలు కనిపించని పరిస్థితి. పొగమంచు కారణంగా ఢిల్లీలో విమాన, రైలు సర్వీసులకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది ఢిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో బుధవారం ఉదయం 6 గంటలకు విజిబిలిటీ 100 మీటర్లుగా నమోదైంది. దీంతో ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌కు రాకపోకలు సాగించే దాదాపు 200కిపైగా విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. కొన్ని విమానాలను రద్దు చేయగా.. మరికొన్నింటిని దారి మళ్లించారు. విమాన సర్వీసులు ఆలస్యం కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో ఇండిగో, స్పైస్‌జెట్, ఎయిర్ ఇండియా సహా పలు విమాన సంస్థలు తమ ప్రయాణికులకు ముందుగానే పలు సూచనలు చేశారు.పొగమంచు కారణంగా విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయని.. ఫ్లైట్ స్టేటస్‌ను ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవాలని సూచించాయి. మరోవైపు దట్టమైన పొగమంచు కారణంగా కనీసం 26 రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయి. బుధవారం ఢిల్లీ-ఎన్సీఆర్ ప్రాంతంలో ఆకాశం మేఘావృతమై ఉంటుందని, సాయంత్రం తేలికపాటి వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం అంచనా వేసింది. ఇదిలా ఉండగా.. బుధవారం ఉదయం ఢిల్లీలో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ చాలా పేలవమైన కేటగిరీలో నమోదైంది. 8 గంటల సమయంలో ఢిల్లీలో ఏక్యూఐ లెవల్స్ 332గా నమోదయ్యాయి.

## ఆర్ఎస్ఎస్ బాటలో బీఆర్ఎస్ - సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, జనవరి 15:తెలంగాణలో బీఆర్ఎస్ , బీజేపీ వైఖరి ఒకేరకంగా ఉన్నదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఢిల్లీలో జరిగిన ఏఐసీసీ హెడ్ క్వార్టర్ కార్యాలయం ప్రారంభోత్సవానికి హాజరైన ఆయన అక్కడి మీడియాతో మాట్లాడుతూ, ఆర్ఎస్ఎస్ అడుగు జాడల్లో వెళ్లేందుకు బీఆర్ఎస్ ప్రయత్నిస్తోందని అన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ పై బీజేపీ ఏ ఆరోపణలు చేస్తే తెలంగాణలో కాంగ్రెస్ పై బీఆర్ఎస్ అవే ఆరోపణలు చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ నేర్చుకోవాల్సిన అవసరం లేదన్నారు.

140 ఏళ్ల చరిత్ర కలిగి కాంగ్రెస్ పార్టీ సొంత కార్యాలయం నిర్మించుకునేందుకు ఇన్నేళ్లు పట్టిందని అంటూ అదే నిన్నగాక మొన్న వచ్చిన ప్రాంతీయ పార్టీలు 40 ఏళ్ల సీనియార్టీ మాత్రమే ఉన్న బీజేపీ స్వల్పకాలంలోనే కార్యాలయాలు ఏర్పాటు చేసుకున్నాయన్నారు రేవంత్. తమ పార్టీ ప్రజల కోసం ఎంత నిస్వార్థంగా పని చేస్తుందో దీన్ని బట్టే అర్థం చేసుకోవాలన్నారు. బీజేపీ, ఇతర ప్రాంతీయ పార్టీల ఆర్థిక స్థితిగతులు, కాంగ్రెస్ పార్టీ ఆర్థిక స్థితిగతి ఎలా ఉందో గమనించాలన్నారు. రాబోయే రోజుల్లో ఇక్కడి నుంచే దేశాభివృద్ధికి అవసరమైన నిర్ణయాలు, ప్రణాళికలు రచించబడతాయన్నారు. ఇక తెలంగాణలో చట్టబద్ధమైన పాలన సాగుతున్నదన్నారు.

## మహా కుంభమేళాలో ఆకట్టుకుంటున్న శ్రీవారి నమూనా ఆలయం.. స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

తిరుపతి, జనవరి 15:ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాలో ఏర్పాటు చేసిన తిరుమల శ్రీవారి నమూనా ఆలయం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంటుంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుంటున్నారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామివారికి నిత్య కైంకర్యాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.

శ్రీవారి ఆలయంలో నిత్య కైంకర్యాల తరహాలో తిరుప్పావై సేవ, తోమాలసేవ, కొలువు, సహస్ర నామార్చన నిర్వహించారు. భక్తులను స్వామివారి ప్రసాదాలు వితరణ చేశారు. వాహన మండపంలో శ్రీదేవి , భూదేవి సమేత మలయప్ప స్వామికి వేడుకగా ఊంజల్ సేవ నిర్వహించారు. నిన్న సాయంత్రం 6 గంటల వరకు 7,083 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.



### భక్తులు విరాళాలు సమర్పించేందుకు కియోస్క్ మిషన్ ఏర్పాటు

ప్రయాగ్ రాజ్ లోని శ్రీవారి నమూనా ఆలయంలో భక్తులు విరాళాలు సమర్పించేందుకు వీలుగా టీటీడీ కియోస్క్ మిషన్ (సెల్ఫ్ ఆపరేటెడ్ మిషన్) ఏర్పాటు చేసింది. ఈ మిషన్ ద్వారా భక్తులు క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి రూ.1 నుంచి రూ.99,999 వరకు తమకు తోచిన మొత్తాన్ని టీటీడీకి (ఐఆ) విరాళంగా ఇవ్వవచ్చని అధికారులు తెలిపారు.

### ఈనెల 18న ప్రయాగ్‌రాజ్‌లో శ్రీవారి కళ్యాణోత్సవం

ఈనెల 18వ తేదీన ఉదయం 11 నుంచి 12 గంటలకు శ్రీవారి నమూనా ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వేదికపై స్వామివారికి కళ్యాణోత్సవం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో హిందూ ధర్మ ప్రచార పరిషత్ సెక్రటరీ శ్రీరామ్ రఘునాథ్, ఎస్టేట్ ఆఫీసర్ గుణ భూషణ్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## తుపాకుల విక్రయ ముఠా అరెస్టు




హైదరాబాద్, జనవరి 15: హైదరాబాద్‌లో తుపాకులు విక్రయించేందుకు వచ్చినా ముఠాను రాచకొండ పోలీసులు పట్టుకున్నారు. ముఠా నుంచి మూడు తుపాకులతో పాటు పది బుల్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. బీహార్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ కు చెందిన ముఠాగా పోలీసులు గుర్తించారు.

### ముఠా సూత్రధారి కోసం పోలీసుల వేట..

తుపాకుల విక్రయించేందుకు ముఠాకు సూత్రధారి కోసం పోలీసులు గాలిస్తున్నారు. ముఠా సభ్యులు ఎవరి కోసం గన్స్ తీసుకొచ్చారు..గన్స్ కోసం ఎవరైనా ఈ ముఠాని సంప్రదించారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ముఠా గతంలో ఎవరికైనా గన్స్ విక్రయించారా అని కూడా ఆరా తీస్తున్నారు. ముఠా సభ్యులకు నగరంలో సంబంధాలు ఉన్నందునే వారు రాష్ట్రానికి గన్స్ అమ్మకానికి వచ్చారని పోలీసులు భావిస్తున్నారు.

### గత ఏడాది కూడా..

గత ఏడాది కూడా హైదరాబాద్‌లో నకిలీ గన్ లైసెన్స్‌లతో సొంతంగా తుపాకులు తయారు చేస్తూ అమ్ముతున్న మూఠాను పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి 34 నకిలీ లైసెన్సులు, 33 తుపాకీలు, 140 రౌండ్స్ బులెట్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు ఇతర రాష్ట్రాల నుంచి తుపాకులు తీసుకొచ్చి ఇక్కడ నకిలీ లైసెన్సుతో అమ్మకాలు చేస్తున్నట్లుగా గుర్తించారు. ఆ కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## న్యూ ఢిల్లీ స్థానానికి నామినేషన్ వేసిన అరవింద్ కేజ్రీవాల్

న్యూఢిల్లీ, జనవరి 15:వచ్చే నెల 5వ తేదీన ఢిల్లీ అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. ఎన్నికలకు సంబంధించి ఈ నెల 10న నోటిఫికేషన్ విడుదల కాగా.. 17వ తేదీ వరకు నామినేషన్‌లకు అవకాశం కల్పించారు. ఇక గడువు సమీపిస్తుండటంతో రాజధానిలో నామినేషన్‌లు జోరందుకున్నాయి. ఇప్పటికే కల్కాజీ అసెంబ్లీ నియోజకవర్గానికి ఢిల్లీ సీఎం అతిశీ నామినేషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. తాజాగా మాజీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ నామినేషన్ దాఖలు చేశారు.

కేజ్రీవాల్ న్యూ ఢిల్లీ స్థానం నుంచి పోటీ చేస్తున్న విషయం తెలిసిందే.




ఇందులో భాగంగా ఇవాళ నామినేషన్ దాఖలు చేశారు. ఇవాళ ఉదయం తన కుటుంబ సభ్యులతో కలిసి కన్నాట్ ప్రాంతంలోని హనుమాన్ ఆలయాన్ని సందర్శించారు. అక్కడ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రిటర్నింగ్ ఆఫీస్‌కు ర్యాలీగా వెళ్లి.. అక్కడ నామినేషన్ దాఖలు చేశారు. రిటర్నింగ్ ఆఫీసర్‌కు నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని ప్రజలను కోరారు. కాగా ఢిల్లీలోని మొత్తం 70 అసెంబ్లీ స్థానాలకు ఫిబ్రవరి 5న పోలింగ్ జరగనుంది. ఫిబ్రవరి 8న ఓట్లను లెక్కించి ఫలితాలు వెల్లడించనున్నారు.

## భీంగల్ సీఐ నవీన్ బదిలీ..

నిజామాబాద్, జనవరి 15: భీంగల్ సర్కిల్ ఇన్ స్పెక్టర్ నవీన్ పై అధికారులు బదిలీవేటు వేశారు. నిజామాబాద్ హెడ్ క్వార్టర్ కు అటాచ్ చేస్తూ ఉత్తర్వులు వెల్లడయ్యాయి. ఇటీవల భీంగల్ పోలీస్ స్టేషన్ లో నమోదైన పలు కేసుల్లో పోలీసులపై ఆరోపణలు వచ్చాయి. భీంగల్ కు చెందిన సత్య గంగయ్య తన కేసు విషయంలో తన లొకేషన్ ను సీఐ ట్రేస్ చేసి ఇవ్వడంతోనే తనపై దాడి చేయడం జరిగిందని ఆరోపణలు చేశారు.

తనపై దాడికి పూర్తి బాధ్యత సీఐ దేనని ఆర్మూర్ ఏసీపీ విచారణలో బాధితుడు చెప్పినట్టు సమాచారం. ఈ వివాదం నేపథ్యంలో సీఐని నిజామాబాద్ హెడ్ క్వార్టర్ కు అటాచ్ చేస్తూ ఉత్తర్వులు వెల్లడైనట్టు సమాచారం. సీఐపై వచ్చిన ఆరోపణలపై పోలీస్ అధికారులు విచారణ జరుపుతున్నారు.

భీమ్‌గల్ పోలీస్ స్టేషన్ సీఐలకు కలిసిరావడం లేదు. ఏడాది కాలంలోనే ఇద్దరు సీఐలు వివాదాల్లో చిక్కుకుని బదిలీ అయ్యారు. 2024 జనవరిలో భీమ్‌గల్ సీఐగా నాగపురి శ్రీనివాస్ నిర్మల్ నుండి భీమ్‌గల్ కు బదిలీపై వచ్చారు. వచ్చిన ఆరు నెలల్లోనే ఇసుక వివాదంలో ఇరుక్కుని కేవలం ఆరు నెలల్లోనే జూన్ 2024లో బదిలీ అయ్యారు. నాగపురి శ్రీనివాస్ బదిలీ అయిన తరువాత మెట్పల్లి నుండి భీమ్‌గల్ సీఐగా జూన్ 2024లో బాధ్యత తీసుకున్న సీఐ నవీన్ కుమార్ కేవలం అరునెలల్లోనే జనవరి 14న బదిలీ అయ్యారు. నవీన్ కుమార్ పై భార్య, భర్తల కేసులో పలు ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో పోలీస్ ఉన్నతాధికారులు బదిలీ వేటు వేశారు. నిజామాబాద్ హెడ్ క్వార్టర్ కు అటాచ్ చేయడం జరిగింది.

భీంగల్ పోలీస్ స్టేషన్ ఉదయం నుండి సాయంత్రం వరకు మధ్యవర్తులతో కిటకిటలాడుతుంది. కేసులు దొరికితే మధ్యవర్తులు వదలడం లేదు. ఈజీ మనీకి అలవాటు పడిన కొందరు వ్యక్తులు పంచాయతీలు తెంపడమే పనిగా పెట్టుకుంటున్నారు.

### చురక

అన్యాయం ఏదైనా
అడిగే తందుకు
అస్తిత్వం ఆలాపన
అలజడెందుకు
రచయితలకెందుకీ
రాజకీయ రగిలేచిచ్చు
ప్రాంతం ఏదైతేనేమి
ప్రతిభేకదా దీప్తికుచ్చు

-వేల్పుల నారాయణ
9440433475



### నేటి కందం- నేటికి అందం

నీతిగ నిజాయితీగా
జాతికి పేరొసగు చిన్న సంస్థల కొరకై
జాతీయాంకుర దినమును
ప్రీతిగ జరుపంగ వలయు విబుధులు మెచ్చన్ !!

(జనవరి 16 జాతీయ అంకుర దినం)

-రాధశ్రీ
సెల్:9494481210



## కృష్ణా జలాల్లో మేజర్ షేర్ - ట్రిబ్యునల్ లో వాదన వినిపిస్తామన్న ఉత్తమ్

హైదరాబాద్, జనవరి 15: కృష్ణ ట్రిబ్యునల్ పై గురువారం నుంచి రెండు రోజుల పాటు సుప్రీంకోర్టు లో వాదనలు జరగనున్నాయి. న్యాయస్థానంలో తెలంగాణ తరఫున బలమైన వాదనలు వినిపించాలని అడ్వకేట్ జనరల్, సుప్రీంకోర్టు న్యాయవాది వైద్యనాథన్‌ను నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సూచించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణకు 299 టీఎంసీలు, ఏపీకి 512 టీఎంసీల ప్రతిపాదనకు సూచనప్రాయంగా ఒప్పుకున్నారని, నీళ్ల విషయంలో తెలంగాణకు అన్యాయం జరగవద్దని మంత్రి అన్నారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 811 టిఎంసిల నీటి కేటాయింపులు జరిగాయని, ఆ వాదనను తాము ఇప్పుడు ఏకీభవించడం లేదన్నారు. తెలంగాణలో నీటి లభ్యత, సాగు విస్తీర్ణం ఎక్కువగా ఉందని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 811 టీఎంసీలు కేటాయించారని, అందులో మెజార్టీ టీఎంసీలు తెలంగాణకు కేటాయించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. కృష్ణా జలాలపై అధిక హక్కులు తమకే ఉన్నాయనే వాదనను ట్రిబ్యునల్ లో వాదించనున్నట్లు తెలిపారు..

## విషాదం..ఇద్దరి మెడను కోసేసిన చైనా మాంజా.. హాస్పిటల్‌కు తరలింపు

హైదరాబాద్, జనవరి 15: ప్రభుత్వం నిషేధించినా, పోలీసులు ఎన్ని కేసులు నమోదు చేసినా కొందరిలో మార్పు రావడం లేదు. చైనా మాంజా కారణంగా కుటుంబాల్లో విషాదాన్ని మిగుల్చుతోంది.

కొంతమంది ప్రాణాలు కోల్పోతుండగా, మరికొందరు తీవ్రగాయాలపాలవుతున్నారు. తాజాగా కామారెడ్డిలోని రామారెడ్డిలో బైక్‌పై వెళ్తున్న జావెద్ అనే వ్యక్తి గొంతుకు చైనా మాంజా తగిలి తీవ్ర రక్తస్రావం అయింది. గమనించిన స్థానికులు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు.

జావెద్ సైలన్ బాబా కాలనీకి చెందిన వాసిగా గుర్తించారు. మరో ఘటనలో హైదరాబాదర్‌లోని నారాయణగూడ పీఎస్ లిమిట్స్‌లో మరో ప్రమాదం చోటు చేసుకుంది. లంగర్‌హౌస్ ట్రాఫిక్ పోలీస్‌గా పని చేస్తున్న శివరాజ్ విధులు ముగించుకొని నారాయణగూడ ఫ్లైఓవర్ నుంచి దిగుతుండగా చైనా మాంజా మెడకు చుట్టుకుకోవడంతో కొంత మేర చర్మం చీలిపోయింది. క్షతగాత్రుడిని చికిత్స కోసం ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు.

## వయనాడ్ విపత్తుపై కేరళ సర్కార్ కీలక నిర్ణయం

న్యూఢిల్లీ, జనవరి 15: కేరళలోని వయనాడ్ లో గతేడాది సంభవించిన ఘోరవిపత్తు ఘటనపై పినరయి విజయన్ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. కొండచరియలు విరిగిపడిన ఘటనలో గల్లంతైన వారిని మృతులుగా ప్రకటించాలని నిర్ణయించింది. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.



ఈ నిర్ణయంతో విపత్తులో గల్లంతైన వారి కుటుంబ సభ్యులకు లబ్ధి చేకూరుతుందని, పరిహారం అందించేందుకు సహాయపడుతుందని అభిప్రాయపడింది. మిస్ అయిన వ్యక్తుల జాబితాను పరిశీలించేందుకు రెవెన్యూ శాఖ అధికారులతో సహా స్థానిక, జిల్లా, రాష్ట్ర స్థాయి కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు ఉత్తర్వులో పేర్కొంది. ఈ కమిటీ విపత్తులో తప్పిపోయిన వారి జాబితాను తయారు చేసి పరిశీలన కోసం జిల్లా విపత్తు నిర్వహణ అథారిటీకి సమర్పిస్తుంది. డీడీఎమ్ఏ ఆ జాబితాను పరిశీలించి రాష్ట్ర స్థాయి కమిటీకి పంపితే.. అక్కడి నుంచి ఆ జాబితా ప్రభుత్వానికి చేరుతుంది. ఈ జాబితాలో పేర్లు ఉన్నవారిని ప్రభుత్వం మృతులుగా ప్రకటించి.. వారి బంధువులకు పరిహారం అందిస్తుంది.

కాగా, గతేడాది జులై 30న వయనాడ్‌లో ఘోర ప్రకృతి విపత్తు సంభవించిన విషయం తెలిసిందే. భారీ వర్షాలు కురవడంతో కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ దుర్ఘటనలో గ్రామాలకు గ్రామాలే తుడిచిపెట్టుకుపోయాయి. ఈ ఘటనలో సుమారు 263 మంది ప్రాణాలు కోల్పోయినట్లు ప్రభుత్వ రికార్డులు చెబుతున్నాయి. మరో 35 మంది మిస్సయ్యారు.

## చైనీస్ మాంజాపై హైదరాబాద్ సీపీ కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, జనవరి 15:రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలో విచ్చలవిడిగా లభ్యమవుతున్న చైనీస్ మాంజాపై నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ కీలక వ్యాఖ్యలు చేశారు. చైనీస్ మాంజాను స్థానికంగా తయారు చేయడం వల్లే పెద్ద మొత్తంలో లభ్యమవుతుందని తెలిపారు. ఈ -కామర్స్ వెబ్‌సైట్‌లో ఆర్డర్ చేసుకుంటే ఇంటికే వస్తుందన్నారు. ఈ క్రమంలో త్వరలోనే ఈ-కామర్స్ గోదాములపై కూడా సోదాలు చేస్తామని సీపీ తెలిపారు. గోదాముల నిర్వాహకులతో త్వరలోనే సమావేశం ఏర్పాటు చేసి.. కీలక సూచలే జారీ చేస్తామన్నారు. చైనీస్ మాంజా వినియోగాన్ని అరికట్టడంలో ప్రజలంతా స్వచ్ఛందంగా ముందుకు వస్తేనే సాధ్యమవుతుందని సీవీ ఆనంద్ స్పష్టం చేశారు.

లంగర్‌హౌజ్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఓ కానిస్టేబుల్ మెడకు చైనా మాంజా తగిలి తీవ్ర గాయమైంది. నిన్న తన విధులు ముగించుకుని ఇంటికి తిరిగి వస్తుండగా నారాయణగూడ ఫ్లై ఓవర్ మీద ఈ ఘటన చోటు చేసుకుంది.

నేటినిజం
# సాహితీ కెరటాలు
E-mail : netinijam93@gmail.com
website: www.netinijam.com
2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 గురువారం 16-1-2025

## ఘంటారావం

జ్యోతిలా
జీవించు
వెలుగై
విస్తరించు.

అమ్మా నాన్నలు
ఆకాశమంత
వారి పాదాల చెంత
నేను అణువంత

నిరాశ
ఆపేస్తుంది
ఆశ
ఊపేస్తుంది

కుటుంబం
మాటలు నేర్పుతుంది
సమాజం
మౌనం నేర్పుతుంది

గన్ను
నిర్మూలిస్తుంది
పెన్ను
నిర్మిస్తుంది



-గంటా మనోహర్‌రెడ్డి
సెల్:9949992964

## గజల్

నిరాశ చెందుతు ఆశల దీపం ఆర్పుట ఎందుకు
గతాలు తవ్వుతు మానిన గాయం రేపుట ఎందుకు
నీడై నిలిచిన చెట్లను నరుకుట ఆపకపోతివి
ఆయువు పోసే గాలి తగ్గెనని కుములుట ఎందుకు
నచ్చిన మగువలు తామై వస్తే పలకకపోతివి
ఒంటరి బతుకిక నరకం అంటూ ఏడ్చుట ఎందుకువె
గజిబిజి పదాల అల్లిక చేస్తే భావం చిరిగెను
చిరిగిన కవితకు అతుకుల బొంతలు కుట్టుట ఎందుకు
శిశిరం రాల్చిన ఆకుల పైనే తలపేంటి శివా!
చిగుర్లు తొడిగే ఆశలుండునని మరుచుట ఎందుకు

-శివకృష్ణ కొక్కుల
9989627222



## చలి

రాత్రి
ఆఖరి బస్సు తర్వాత
అరటి పండ్ల బండిని
తోసుక పోతున్నాడతడు.
మిగిలిన రెండు పండ్లు
చలికి ముడుచుకున్న
అనాథ శిశువుల్లా పడి వున్నాయి.
ముఖ్యంగా
సరిహద్దుల్లో
గస్తీ కాస్తున్న సైనికులు
ఎలా వున్నారో అని ఆలోచిస్తే
చలి మరీ ఎక్కువైంది.
ఇక లాభం లేదను కొని

పాత మడతల్లోంచి
మా అమ్మ కుట్టిన బొంతను బయటికి
తీశాను
ఇక చలి
తగ్గుముఖం పదుతుందను కుంటాను.

చలి కనబడదు
చల్లని చేతులతో కలబడుతుంది
ఇవాళ సూర్యుడు

నా లాగే వృద్ధుడు
మబ్బు రగ్గుల్లోంచి
తల బైట పెట్టడు.
పొద్దున్నే
చలిని రంగరించుకున్న చీకటి
కాళ్లకు తగిలి
అంటుక పోతున్నది.



-డా॥ ఎన్. గోపి
సెల్:9391028496

# వైజయంతి, సప్తశతి గ్రంథాల ఆవిష్కరణ



గ్రంథాలను ఆవిష్కరిస్తున్న డా॥ కె.వి.రమణాచారి. వేదికపై అతిథులు

తెలంగాణ ప్రభుత్వం, భాషా సాంస్కృతికశాఖ, ఎం.వి.ఆర్. ఫౌండేషన్ ఆధ్వర్యంలో విహారి రచించిన జగన్నాథ పండిత రాయలు నవల సమీక్ష వ్యాసాల సంకలనంగా 'వైజయంతి' గ్రంథం ఆవిష్కరణ, సుధామ సంకలనంగా 'ఏడువందల సప్తపదుల'తో రూపొందిన 'సప్తశతి' ఆవిష్కరణ సభ శనివారం రవీంద్ర భారతిలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారుదు డా॥కే.వి. రమణాచారి విచ్చేసి గ్రంథాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డా॥.వై. రామకృష్ణారావు, జి. వల్లీశ్వర్, సింహప్రసాద్, సీఎస్ రాంబాబు, మట్టిగుంట వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# కన్నవాళ్ళను కంటికి రెప్పలా చూడాలి

-కె.వి.రమణాచారి



'మరువంపుపూల మట్టితీగ' పుస్తకావిష్కరణలో పెద్దూరి వెంకటదాసు, డా॥తుర్లపాటి రాజేశ్వరి, డా॥కొండపల్లి నీహారిణి, బైస దేవదాసు, డా॥నామోజు బాలాచారి, ఆవిష్కర్త డా॥కె.వి.రమణాచారి, ఎన్వీ రఘువీర్ ప్రతాప్, డా॥ తండుకృష్ణ కౌండిన్య, పెరుమాండ్ల ఆనంద్, డా॥ వి. జయప్రకాశ్, డా॥ సాగర్ల సతయ్య

కన్నవాళ్ళను కంటికి రెప్పలా చూసుకున్నప్పుడే వారి జీవితం ధన్యమవుతుందని విశ్రాంత ఐ.ఏ.ఎస్. అధికారి డా॥కె.వి. రమణాచారి అన్నారు. తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ, తెలంగాణ సాహిత్య అకాడమీ, ధర్మకేతనం సాహిత్య కళాపీఠం సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం రవీంద్ర భారతిలోని సమావేశ మందిరంలో ఎన్వీ రఘువీర్ ప్రతాప్ కవిత్వంపై వ్యాసావళి ''మరువంపు పూల మట్టి తీగ'' గ్రంథావిష్కరణ, బ్రహ్మశ్రీ నారాయణదాసు శ్రీ రామాచార్యులు- శ్రీమతి నారాయణదాసు వెంకట శేషమ్మ స్మారక సాహితీ పురస్కారాల సభను ఘనంగా నిర్వహించారు.

ముఖ్య అతిథిగా విచ్చేసిన రమణాచారి మాట్లాడుతు తల్లిదండ్రులను ఎల్లప్పుడూ వారికి సేవ చేయడం బిడ్డల కర్తవ్యమని అన్నారు. భౌతికంగా వారు లేకపోయినా వారి పేరున స్మారక సాహితీ పురస్కారాలు అందజేయడం గొప్పగా వుందని అన్నారు. తల్లిదండ్రుల పట్ల గౌరవ ప్రదంగా మసులు కోవడం వల్ల మన పిల్లల కూడా భవిష్యత్తులో గౌరవప్రదంగా జీవించడం నేర్చుకుంటారని వివరించారు. రామాచార్యుల స్మారక పురస్కారాన్ని 2023కు గాను డా॥ వి. జయప్రకాశ్, 2024కు గాను అవధాని శ్రీ అవుసుల భానుప్రకాశ్, వెంకట శేషమ్మ, స్మారక పురస్కారాన్ని 2023కు గాను శ్రీమతి వావిలికొలను రాజ్యలక్ష్మి, 2024కుగాను డా॥తుర్లపాటి రాజేశ్వరిలకు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మొదట ఎన్వీ









డా॥వి. జయప్రకాశ్, అవధాని శ్రీ అవుసుల భానుప్రకాశ్‌కు **"బ్రహ్మశ్రీ నారాయణదాసు, శ్రీ రామాచార్యులు స్మారక సాహితీ పురస్కారం"** శ్రీమతి వావిలికొలను రాజ్యలక్ష్మి, డా॥తుర్లపాటి రాజేశ్వరిలకు **"శ్రీమతి నారాయణదాసు వెంకట శేషమ్మ స్మారక సాహితీ పురస్కారం"** ప్రదానం చేస్తున్న అతిథులు

సామాజికాంశాలపై కవిత్వాన్ని రాస్తున్న రఘువీర్ ప్రతాప్‌ను అభినందించారు.

"అమ్మ జన్మనిస్తుందని- అక్షరం పునర్జన్మనిస్తుందని" అంటూ తన కవిత్వంలో వివరించిన అరవై ఏళ్ళ రఘువీర్ ప్రతాప్ గత ముప్పై ఏళ్ళ నుండి కవిత్వం రాస్తున్నారని నేటినిజం పత్రిక సంపాదకులు బైస దేవదాసు తెలిపారు. అమ్మ పుట్టుకనిస్తే, భవితకు వెలుగులు నింపి మార్గమేసేది అక్షరమే. చదువే జీవితానికి మార్గదర్శి. అటవీ శాఖలో ఉద్యోగం చేస్తూ ప్రకృతి అందాలను, ప్రకృతిపై విరుచుకుపడుతున్న మనిషి చర్యలను ఒకవైపు, సమాజంలో జరుగుతున్న అస్తవ్యస్త పరిస్థితులపై తన కవిత్వం ద్వారా సాహిత్య కృషి చేస్తున్న రఘుర్ ప్రతాప్‌ను అభినందిచారు. కీర్తి శేషులైన తన తల్లి దండ్రుల పేరున ప్రతి సంవత్సరం స్మారక సాహితీ పురస్కారాలు ప్రదానం చేయడం తల్లిదండ్రులపట్ల రఘువీర్ ప్రతాప్‌కు వున్న ప్రేమ తెలియ పరుస్తోందని ప్రతాప్‌ను అభినందించారు. భౌతికంగా వున్న లేకపోయినా తల్లిదండ్రుల పట్ల ప్రతి వ్యక్తి వారిని గౌరవంగా చూసుకోవలసిన బాధ్యత వుంటుందని అన్నారు.

రచయిత్రి, మయూఖ పత్రిక సంపాదకురాలు కొండపల్లి నీహారిణి "మరువంపు పూల మట్టితీగ" పుస్తక సమీక్ష చేశారు. పుస్తక సంపాదకులు డా॥ సాగర్ల సత్తయ్య, డా॥ తండుకృష్ణ కౌండిన్య, పెరుమాళ్ళ ఆనంద్ మాట్లాడారు. మొదటి ప్రతిని శ్రీమతి పోలోజు రామేశ్వరమ్మ-సువర్ణమూర్తి దంపతులకు అందజేశారు.

పురస్కార గ్రహీతలు తమ స్పందన తెలిపారు. తమ "ధర్మ కేతనం సాహిత్య కళాపీఠం" నిర్వహిస్తున్న కార్యక్రమాలను ఎన్వీ రఘువీర్ ప్రతాప్ వివరించారు. సభకు విచ్చేసిన వారందరికీ, పుస్తకాన్ని తీర్చిదిద్దిన సంపాదక వర్గానికి ధన్యవాదాలు తెలిపారు.



ఎన్వీ రఘువీర్ ప్రతాప్ దంపతులను సత్కరిస్తున్న అతిథులు.



మొదటి ప్రతిని స్వీకరిస్తున్న శ్రీమతి పోలోజు రామేశ్వరమ్మ, సువర్ణమూర్తి

రఘువీర్ ప్రతాప్ కవిత్వంపై పలువురు రాసిన వ్యాసాల సంపుటి ''మరువంపుపూల మట్టి తీగ'' గ్రంథాన్ని డా॥కె.వి.రమణాచారి ఆవిష్కరించారు. రఘువీర్ ప్రతాప్ అటవీశాఖలో విధులు నిర్వహిస్తూ మంచి కవిత్వాన్ని రాస్తున్నారని 60 మంది కవులు కవయిత్రులు రఘువీర్ ప్రతాప్ సాహిత్యంపై రాసిన రచనలే అందుకు నిదర్శనమని అన్నారు. పాతికేళ్ళుగా ప్రతాప్ తనకు తెలుసునని ఆవేశానికి, అత్యాశకు పోకుండా చాలా నెమ్మదిగా ఎదుగుతున్నారని అన్నారు.

జీవిత భాగస్వామి శ్రీమతి జ్యోత్స్న సహకారంతో కవిత్వంలో పట్టు సాధించారని అభినందించారు.

సభకు అధ్యక్షత వహించిన తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డా॥నామోజు బాలాచారి మాట్లాడుతు సాహిత్య అకాడమీ తరపున విభిన్న కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, కవి సమ్మేళనాలు, పుస్తకావిష్కరణలు, చర్చాగోష్టులతో సమావేశాలు నిర్వహిస్తు కవులను, రచయితలను ప్రోత్సహిస్తున్నామని అన్నారు.

కవి, రచయిత పెద్దూరి వెంకటదాసు సభ సమన్వయం చేశారు. చివర డా॥సాగర్ల సత్తయ్య వందన సమర్పణ చేశారు.

# జీవనగమనం ఒక సామాజిక ఉద్యమ చరిత్ర



బి.ఎస్. రాములు నిత్య చైతన్యశీలి. ఆచరణవాది. ఎప్పుడు మౌనంగా ఉన్నది లేదు. ఒక వైపు విస్తృతంగా సాహిత్య కృషి చేసాన్తనే మరోవైపు ఉద్యమకారుడిగా జీవితం కొనసాగించినవారు బి.ఎస్. రాములు. ఇందులో 1983-1984 కాలం నాటి జీవితం సంస్కృతి, విప్లవోద్యమం తీరుతెన్నులు చిత్రించారు. నిజానికి అది ఒక సంక్షోభిత కాలం. పాత సమాజపు చెదులను తొలగించి నూతన సమాజ నిర్మాణం కోసం ప్రజలు పోరాడిన కాలం. జగిత్యాల జైత్రయాత్ర తరువాత ప్రజా ఉద్యమాలు నిర్దిష్ట రూపం సంతరించుకొని నూతన చరిత్ర సృష్టిస్తున్న కాలం.

ఆ కాలంలో పెద్ద ఎత్తున ప్రజా పోరాటాలు వెల్లువెత్తాయి. గ్రామాల్లో రైతు కూలి సంఘాలు బలపడి ఫ్యూడల్ దొరలకు వ్యతిరేకంగా భూమి, భుక్తి, విముక్తి కోసం నడుం బిగించినట్లు, మరోవైపు సింగరేణి బొగ్గు గనుల్లో తరతరాల అణచివేత, దోపిడి నుండి విముక్తి కొరకు బొగ్గుగని కార్మికులు పోరాడుతున్న కాలం. ఇంకో వైపు గిరిజనులు 'జల్ జంగల్ జమీన్' పై తమకే సర్వాధికారాలు కావాలని పోరాడుతున్న సందర్భం.

ఆ కాలంలో రాష్ట్ర రాజకీయాల్లో పెనుమార్పులు సంభవించాయి. 1982లో ప్రముఖ సినీనటుడు ఎన్టీ రామారావు తెలుగువారి ఆత్మగౌరవం మంట గలిసిందని, నక్సలైటే నిజమైన దేశభక్తులంటూ ప్రజల్లోకి విస్తృతంగా చొచ్చుకుపోయి ప్రచారం సాగించి ప్రజల్లో కొత్త ఆశలు కల్పించారు. తెలుగుదేశం పార్టీని స్థాపించిన తొమ్మిది నెలల కాలంలోనే జనవరి 1983లో జరిగిన 6వ దఫా అసెంబ్లీ ఎన్నికల్లో భారీ మెజార్టీ సాధించి, స్వాతంత్ర్యం వచ్చిన కాన్నుంచి రాష్ట్రంలో ఎదురు లేకుండా పరిపాలన సాగిస్తున్న కాంగ్రెసు పార్టీని మట్టి కరిపించి ముఖ్యమంత్రిగా కొత్త చరిత్ర సృష్టించారు. ఫలితంగా రాజకీయ సమీకరణలు మారినవి. ఒక కొత్త రక్తం రాజకీయాల్లోకి వచ్చింది.

రైతు కూలీల పోరాటాలు సంఘటితమై 22, 23 మే 1983లో కరీంనగర్‌లో రైతుకూలి సంఘం రెండవ రాష్ట్ర మహాసభలు జరుపుకున్నది. ఈ సభ రైతు కూలీలను ఉత్తేజపరచటమే కాకుండా, ఇతర రాష్ట్రాల రైతాంగం పై గొప్ప ప్రచారం చూపింది. ఆ సభ నిర్వహణలో నిర్వహణ కమిటీ సభ్యుడిగా బి.ఎస్. రాములు క్రియాశీల పాత్ర పోషించారు. అదే సంవత్సరం 12, 13 నవంబర్ 1983లో సింగరేణి కార్మిక సమాఖ్య తన రెండవ మహాసభలను కొత్తగూడెంలో జరుపుకున్నది. అప్పటికి ప్రజా సంఘాల పై అప్రకటిత నిషేదం కొనసాగుతున్నది. ఆ సభలకు కార్మికులు హాజరు కాకుండా చూసేందుకు పెద్ద ఎత్తున పోలీసు నిర్బంధం అమలు జరుపుతున్నారు. ఎక్కడికక్కడ అక్రమ అరెస్టులు కొనసాగాయి. అటువంటి పరిస్థితిలో సింగరేణి కార్మికుల పోరాటాలను ప్రతిబింబిస్తూ రాసిన కథలను సేకరించి "బొగ్గు పొరల్లో" అనే కథా సంపుటిని కరీంనగర్ బుక్ ట్రస్టు ద్వారా ప్రచురించారు. సభలో దాన్ని ఆవిష్కరింపజేయటానికి పోలీసుల కండ్లు కప్పి సభకు చేరుకున్న వైనాన్ని రామన్న చాలా వివరంగా చెప్పారు.

ఎన్టీ రామారావు అధికారంలోకి వచ్చిన యాడాదిన్నరకే ఆగష్టు 1984లో నాదెండ్ల భాస్కరరావు తిరుగుబాటు చేసి ముఖ్యమంత్రి అయ్యాడు. కాని అసెంబ్లీలో తన మేజార్టీ నిరూపించుకోవటంలో విఫలం కావటంతో గవర్నర్ రాంలాల్ ఎన్టీ రామారావును తిరిగి నెల రోజులకే ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయించారు. కాని ఎన్టీ రామారావు అసెంబ్లీని రద్దుచేసి ఎన్నికలకు పోయి 1985లో భారీ మెజార్టీతో తిరిగి అధికారంలోకి వచ్చాదు. రెండోసారి అధికారంలోకి వచ్చిన తరువాత ఎన్టీ రామారావు వైఖరిలో మార్పు వచ్చింది.



(ప్రతులకు: విశాల సాహిత్య అకాడమి, నవోదయ బుక్ హౌస్, ఫోన్: 8331966987)

ప్రజా ఉద్యమాలపై ఉక్కుపాదం మోపాడు. దేశంలోని సకల సైనిక బలగాలను రప్పించి ఉద్యమ ప్రాంతంలో వోహరించి తీవ్ర అణచివేతకు దిగినాడు. విప్లవకారులను, సానుభూతి పరులను యధేచ్ఛగా బూటకపు ఎన్‌కౌంటర్లో

**'జీవనగమనం' చదవడం అంటే ఆనాటి కాలపు సామాజిక చరిత్రను చదవడం ప్రజా ఉద్యమాల గురించి అధ్యయనం చేయడం**

కాల్చి చంపడం, ఇండ్లు కూల్చడం అక్రమ కేసులు బనాయించి జైలుపాలు చేయటం పెద్ద ఎత్తున సాగించినారు. ఒక్క మాటలో చెప్పాలంటే ఆ రోజుల్లో సాయుధ బలగాల పదఘట్టనల క్రింద తెలంగాణ పల్లెలు రక్తసిక్తమైనాయి.

అటువంటి నిర్బంద పరిస్థితిలో ఒక వైపు హాస్టల్ వార్డెన్‌గా అత్యంత బాధ్యతాయుతమైన ఉద్యోగ జీవితం గడుపుతూనే పౌరహక్కుల సంఘం బాధ్యతలు తీసుకొని పని చేసారు. ఎక్కడ పౌరహక్కులకు భంగం వాటిల్లితే అక్కడకు పరుగుపెట్టి నిజ నిర్ధారణ చేసి వాస్తవాలను బహిరంగ పరిచారు. మరోవైపు విరసం సభ్యుడిగా నిరంతర సాహిత్య కృషి, సభలు, సమావేశాల్లో పాల్గొనడం, పుస్తక ప్రచురణలు చేపట్టడం, జీవగడ్డ విజయ్‌కుమార్‌తో కలిసి పత్రిక ఏర్పాటు చేయటం వంటి పనుల్లో తలమునకలైనాడు.

1982 జూన్‌లో మాచర్లలో జరిగిన విరసం మహాసభలో ఆయన మొదటి నవల 'బతుకుపోరు' ఆవిష్కరింపబడి బహుళ జనాదరణ పొందింది. 1983లో జిల్లాలో జరిగిన అఖిలభారత విప్లవ సాంస్కృతిక సంస్థలో భాగస్వామి అయినాడు. 1984 జనవరిలో శ్రీకాకుళం జిల్లాలోని మాకివలసలో జరిగిన విరసం పదవ మహాసభలో పాల్గొని విరసం కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికై ఇంటికి వచ్చిన రామన్నను జనవరి 23న పోలీసులు ఇంటిమీద దాడి చేసి కొట్టుకుంటూ తీసుకుపోయినారు. దాదాపు వారం రోజులు అక్రమ నిర్బందంలో ఉంచుకొని చిత్రహింసలు పెట్టినారు. అక్రమ అరెస్టుపై ప్రజల నుండి పెద్ద ఎత్తున నిరసనలు రావటంతో జనవరి 30న రాములును కరీంనగర్ జిల్లా జైలుకు పంపినారు. ఈ నిర్బందాలు ఏవీ కూడా అతని మనో ధైర్యాన్ని దెబ్బతీయలేక పోయినవి సరికదా మరింత గట్టిపరిచినయి.

జులై 1984లో అనంతపురంలో జరిగిన రాడికల్ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టి ఉద్యమ నిర్మాణానికి రాష్ట్రమంతటా విస్తృతంగా పర్యటించినాడు. మరోవైపు తన సాహిత్య కృషి కొనసాగించి అనేక కథలు, నవలలు రాసినాడు. రాష్ట్రంలో నిర్బందం మరింత తీవ్రం కావటంతో బహిరంగ కార్యకలాపాలు ఏ మాత్రం నడపలేని పరిస్థితిలో గద్దర్, నంజీవ్, వరవరరావులతో కలిసి దేశవ్యాప్తంగా పర్యటించి ఉద్యమ నిర్మాణంలో భాగస్వామి అయినాడు.

'జీవనగమనం' చదవడం అంటే ఆనాటి కాలపు సామాజిక చరిత్రను చదవడం ప్రజా ఉద్యమాల గురించి అధ్యయనం చేయడం, ఆ చరిత్రలో భాగస్వామి అయిన ఒక ఉద్యమకారుని గురించి తెలుసుకోవడం. కాలగర్భంలో కలిసిపోతున్న ప్రజల చరిత్రను వాళ్ళ ఆశలను, ఆకాంక్షలను, త్యాగాలను అక్షరబద్ధం చేసి మనముందుకు తెచ్చిన పుస్తకం ఇది.

(ఒక సామాన్యుని జీవనగమనం, విప్లవోద్యమాలు - నేను, బి.ఎస్. రాములు స్వీయ చరిత్ర. 215 పేజీలు, వెల 250 రూపాయలు,

- పి. చంద్
సెల్: 9573093526

## జీబ్రా గీతలు

నా పుస్తకం మీద
నీ పేరు ఎందుకు రాస్తాను !.

నీ బొమ్మల పుస్తకాన్ని
నేనెందుకు చదువుతాను !

నీవు నేను ఒకే బస్తీలో వున్నప్పుడు
వచ్చీ పోయే దారిలో
ఈ గాజు ముక్కలను ఎవరు పారేస్తున్నారు?

ఈ సుడి గాలులు దీపాలను ఆర్పేయలేవు !

ఈ చీకట్లకు కళ్ళుండవు ! --
ఏ బండ రాయి మీదనో భళ్ళున పగిలిపోతాయి !

ఈ మలుపుల్లోని ముళ్ళు
చాలా మంది కాళ్ళకు గుచ్చుకునే వుంటాయి !
అందరూ కారిన నెత్తురుకు భయపడ్డారే తప్ప,
ఎవరూ ముళ్ళను
పక్కకు తీసేయలేక పోయారు !

ఇక్కడి జనాలకు
చాలా కాలంగా నిద్రలేదు
ఎవరో వెన్నెల రాత్రుల మీద రాళ్ళు విసురుతున్నారు.

కిటికీ రెక్కలమీద వాలిన ప్రశ్నలూ పవనాలూ,
పక్షుల్లా ఎగిరి పోతున్నాయి.

ఈ భూమ్మీద తల్లులు పిల్లలను
మనుషులుగానే కంటారు.

ఈ సమాజం లోని వికారం వాళ్ళను,
హిందువులుగా, ముస్లిములుగా విడదీసి,
తల్లులను దుఃఖంలో ముంచుతుంది.

మనం జంతువులన్నిటినీ
జంతువులే అంటున్నాం.

పక్షులనన్నిటినీ
పక్షులే అంటున్నాం.

మనుషుల్ని మాత్రం
మణిపూర్ కుకీల స్త్రీలను చేసి
నగ్నంగా ఊరేగించి హింసిస్తున్నాం !

లేదా, దళితులను చేసి,
దానవుల్లా చూసి,
నడిరోడ్డు మీద తగల బెడుతున్నాం !

లేదా,ఇష్టమైన ఆహారం తినే వాళ్ళు,
జీవితాన్ని చూసి వొణికి పోవడానికి,
మనసుకు రంగు పూసి,
మనిషిని మతం చేసి,

మానవత్వానికి స్వేచ్ఛ లేకుండా చేసి,
ద్వేషాన్ని సంబరంతో ఊరేగిస్తున్నాం.

కలిసి తిరిగే నేలను
అడుగుల లెక్కలుగా మలిచి,
కొన్ని సరిహద్దు జగడాలుగా
మరి కొన్ని వరిమడి తగాదాలుగా
వచ్చే తరాలకు గూడా
నిద్రలేకుండా చేసు కొంటున్నాం

మనుషులను విడదీసి
భయపెట్టే నెత్తురు జీబ్రా గీత లెందుకు !?

మనిని మనిషి తాకనివ్వని,
మసి బారిన వెగటు పరిమళ మెందుకు !?

వీటన్నిటినీ చేతబడిలా వాడుకొని శాసించే,
అధికారం, జుల్మ్ కాకూడదు.
స్వప్నం కోరే జనం నిస్పృహ చెంద కూడదు.

ఇది పూల పూల దృశ్య కావ్యం
ఇది సీతాకోక చిలుకల సమూహం
ఇది శాంతిని కోరే, గంగా తరంగాల గానం
ఇది భారత దేశం
ఇది మన దేశం



-ఆశారాజు
9392302245

# నారా లోకేష్ తో మంచు మనోజ్ భేటి..

అమరావతి, జనవరి 15: ఏపీ మంత్రి నారా లోకేశ్ ను సినీ నటుడు మంచు మనోజ్ కలిశారు. భార్య మౌనికతో పాటు నారావారిపల్లెకు వెళ్లి లోకేశ్ తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆ ఇద్దరు పలు అంశాలపై చర్చించారు. ఈ భేటీ అనంతరం మనోజ్ దంపతులు రంగంపేటకు వెళ్లి జల్లికట్టు పోటీలను వీక్షించేందుకు పయనమయ్యారు..

మోహన్ బాబు వర్శిటీ వద్ద హై టెన్షన్ ..

మరోవైపు, ఈ ఉదయం తిరుపతిలోని మోహన్ బాబు యూనివర్శిటీ వద్ద హై డ్రామా చోటుచేసుకుంది. మోహన్ బాబు యూనివర్శిటీ నుంచి నారావారిపల్లె వరకు మంచు విష్ణు, మంచు మనోజ్ ఫ్లెక్సీలు వెలిశాయి. అయితే మనోజ్ కు సంబంధించిన ఫ్లెక్సీలను నిన్న తొలగించారు. సుమారు వందకు పైగా ఫ్లెక్సీలను తీసేశారు.

ఈ ఉదయం యూనివర్శిటీ వద్దకు మనోజ్ వస్తున్నాడనే సమాచారంతో అక్కడి పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఈ క్రమంలో యూనివర్శిటీ వద్దకు వెళ్లిన మనోజ్ ను పోలీసులు ఆపేశారు. న్యాయస్థానంలో కుటుంబ వివాదం కేసు ఉన్న నేపథ్యంలో లోపలకు అనుమతించబోమని మనోజ్ కు పోలీసులు తెలిపారు. దీనికి సంబంధించి ఆయనకు నోటీసులు జారీ చేశారు. దీంతో మనోజ్ అక్కడి నుంచి వెనుతిరిగారు. నేరుగా నారావారిపల్లెకు చేరుకున్నారు.

# అక్షరం మెరిసె.. పుస్తకం మురిసె

**అంబరాన్నంటిన సంబరం**
**11 రోజులపాటు నిర్వహణ**
**ఆంగ్ల పుస్తకాలపై యువత మక్కువ**
**రైటర్స్ కోసం ప్రత్యేక స్టాల్**
**ముగిసిన 35వ విజయవాడ పుస్తక మహోత్సవం**

"చిరిగిన చొక్కా అయినా తొడుక్కో... మంచి పుస్తకం కొనుక్కో" కందుకూరి వారి మాటను సాహితీ ప్రియులు అక్షరాల పాటించారు. విజయవాడ ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో జనవరి 2 నుంచి 12వ తేదీ వరకు పదకొండు రోజులపాటు అప్రతిహతంగా సాగిన 35వ విజయవాడ పుస్తక మహోత్సవం విజయవంతమైంది. బుక్ ఫెస్టివల్‌కు అధ్యక్షుడిగా కె.లక్ష్మయ్య, కార్యదర్శిగా టి.మనోహర్‌నాయుడు, సమన్వయ కర్తగా ఎమెస్కో విజయకుమార్, గౌరవాధ్యక్షుడిగా బెల్లపు బాబ్జీ వ్యవహరించారు. 11 రోజుల్లో మూడున్నర లక్షల మంది సందర్శించారు. గతంతో పోలిస్తే విక్రయాలు పుంజుకున్నాయని చెప్పవచ్చు. పుస్తక మహోత్సవ ప్రాంగణానికి పిడికిటి రామకోటేశ్వరరావు పేరు పెట్టారు. చెరుకూరి రామోజీరావు, రతన్ టాటా పేరిట రెండు వేదికలు ఏర్పాటు చేశారు. 200కి పైగా స్టాల్స్ నెలకొల్పారు. మూడు స్టాల్స్‌ను అచ్చంగా రచయితల కోసమే కేటాయించడం విశేషం.



పుస్తక మహోత్సవాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్



రైటర్స్ స్టాల్ వద్ద రచయితలతో ముచ్చటిస్తున్న పవన్ కళ్యాణ్

**బెజవాడ రచయితల పుట్టిల్లు : పవన్**

ప్రధాన వేదికపై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జ్యోతి వెలిగించి పుస్తక మహోత్సవాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విజయవాడ నగరం రచయితలకు పుట్టినిల్లని అభిప్రాయపడ్డారు. తెలుగు సాహిత్యం అద్భుతమైనదని, దాన్ని చదివినప్పుడు మనస్సు, మేధస్సు ఎంతగానో వికసిస్తాయని తెలియజేశారు. కార్యక్రమంలో అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, ఎంపీ టి.అప్పలనాయుడు, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశా తదితరులు పాల్గొన్నారు.

**ముఖ్యాంశాలు:**

- ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల విద్యార్థులను పుస్తక మహోత్సవానికి తీసుకెళ్లి పుస్తకాలను పరిచయం చేయాలని విద్యాశాఖ ఆదేశించింది. దీంతో పెద్ద సంఖ్యలో విద్యార్థులు తరలివచ్చారు.
- 33, 34 నంబర్ల స్టాల్స్‌తో క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే ఉచితంగా పుస్తకం అందజేశారు.
- 36వ నంబరు స్టాల్‌లో పిల్లల కోసం త్రీడీ పుస్తకాలు విక్రయించారు. వీటితో పాటు కళ్లజోడు అందజేశారు.
- 42 నుంచి 44 వరకు స్టాల్స్‌ను కేవలం రచయితల కోసం కేటాయించారు. దాదాపు 50 మందికి పైగా రచయితలు తమ పుస్తకాలను ప్రదర్శించారు. నామమాత్రపు రుసుముతో ఇచ్చిన రైటర్స్ స్టాల్‌ను ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం నిర్వహించింది.
- స్టాల్ నంబరు 196 వద్ద ఎనిమిది అడుగుల ఎత్తు, ఏడడుగుల వెడల్పు, రెండు పేజీలతో ఏర్పాటు చేసిన అతి పెద్ద పుస్తకం విశేషంగా ఆకట్టుకుంది.
- ఈసారి ఉత్తరాది రాష్ట్రాల నుంచి ప్రచురణకర్తలు పెద్ద సంఖ్యలో వచ్చారు. 103 మంది ఇంగ్లిష్ ప్రచురణకర్తలు స్టాల్స్ ఏర్పాటుచేశారు.
- యువతీ యువకులు ఆంగ్ల పుస్తకాలను బాగా కొనుగోలు చేశారు.

**రెండో రోజు...**

నార్ల చిరంజీవి శత జయంతి సభ నిర్వహించారు. కవి, విమర్శకుడు సీతారాంతో పాటు ఆకాశవాణి పూర్వ సంచాలకులు మంజులూరి కృష్ణకుమారి, శ్రీశ్రీ పబ్లిషర్స్ అధినేత విశ్వేశ్వరరావు పాల్గొన్నారు. మరో వేదికపై రతన్ టాటా సంస్మరణ సభ జరిగింది.

**మూడో రోజు..**

శ్రీశ్రీ మహాప్రస్థానం ప్రచురితమై 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రచయితలు అట్టాడ అప్పలనాయుడు, వాడ్రేవు వీరలక్ష్మీదేవి పాల్గొన్నారు.



ఓ పుస్తకావిష్కరణ కార్యక్రమం

**నాలుగో రోజు..**

పుస్తక ప్రదర్శన మొదలయ్యాక వచ్చిన తొలి ఆదివారం సందర్శకులతో కిటకిటలాడింది. వ్యాపారం పెద్ద మొత్తంలో జరిగినట్లు స్టాల్స్ నిర్వాహకులు చెప్పారు. ప్రధాన వేదికపై నటి భానుమతీ రామకృష్ణ శత జయంతి సభ జరిగింది. డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి అధ్యక్షత వహించగా.. జర్నలిస్ట్ రెంటాల జయదేవ ముఖ్య వక్తగా ఉపన్యసించారు. ఇదే రోజు ఆరుద్ర శత జయంతి సభ నిర్వహించారు. ప్రముఖ విశ్లేషకులు తెలకపల్లి రవి, యోగి వేమన విశ్వవిద్యాలయం ఆచార్యుడు ఈశ్వర్‌రెడ్డి హాజరయ్యారు.



కార్యక్రమానికి హాజరైన సందర్శకులు

**ఐదో రోజు..**

పుస్తక మహోత్సవంలో ప్రధాన ఘట్టం.. పుస్తక ప్రియుల పాదయాత్ర జరిగింది. సిద్ధార్థ మహిళా కళాశాల నుంచి ఇందిరా గాంధీ స్టేడియం వరకు సాగింది. రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా హాజరై ముందువరుసలో నడిచారు. పలువురు రాజకీయ ప్రముఖులు, సాహితీ ప్రియులు, విద్యార్థులు పాదయాత్రలో పాల్గొన్నారు. అనంతరం జరిగిన పాదయాత్ర ముగింపు సభలో మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ.. పుస్తక పఠనం ద్వారా సంపూర్ణ వ్యక్తిత్వ వికాసం సాధ్యపడుతుందని చెప్పారు. సభలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, సాహితీవేత్త రాచపాళెం చంద్రశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీతలు పెనుగొండ లక్ష్మీనారాయణ, రమేష్ కార్తీక్ నాయక్‌లకు సత్కరించారు.

**ఆరో రోజు..**

ప్రధాన వేదికపై కవి ఆలూరి బైరాగి శత జయంతి సభ నిర్వహించారు. మాజీ ఎంపీ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, సాహితీవేత్త గుమ్మా సాంబశివరావు పాల్గొన్నారు. రెండో కార్యక్రమంగా బుర్రకథ కళాకారుడు షేక్ నాజర్ శత జయంతి సభ జరిగింది. ఖాదర్ మొహియుద్దీన్ అధ్యక్షత వహించగా.. విమర్శకులు గుంటూరు లక్ష్మీనారాయణ, భరద్వాజ, సీనియర్ సంపాదకులు కె.శ్రీనివాస్, నాజర్ కుమారుడు బాపూజీ మాట్లాడారు.

**ఏడో రోజు..**

శారద కలం పేరుతో రచనలు చేసిన కథా రచయిత సుబ్రహ్మణ్యన్ నటరాజన్ శత జయంతి సభ నిర్వహించారు. శరత్‌చంద్ర జ్యోతిశ్రీ అధ్యక్షత వహించారు.

**ఎనిమిదో రోజు..**

ప్రధాన వేదికపై గ్రంథాలయ పునర్వికాస సదస్సు నిర్వహించారు. ఎస్.వెంకట నారాయణ అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, ఎమెస్కో విజయకుమార్, మనసు ఫౌండేషన్ నుంచి మన్నెం రాయుడు తదితరులు పాల్గొన్నారు.

**తొమ్మిదో రోజు..**

కేవలం పుస్తకావిష్కరణలే జరిగాయి.

**పదో రోజు..**

పుస్తక ప్రదర్శన ముగింపునకు ఒక రోజు ముందు.. అంటే శనివారం ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రెండున్నర గంటల పాటు పలు స్టాల్స్‌ను సందర్శించారు. లక్షలాది రూపాయల విలువైన పుస్తకాలను కొనుగోలు చేశారు. రైటర్స్ స్టాల్‌లో పలువురు రచయితలతో ముచ్చటించారు. సాయంత్రం సందర్శకులతో ప్రాంగణం కిక్కిరిసింది. పెద్ద సంఖ్యలో పుస్తకాలు అమ్ముడయ్యాయి.

**పదకొండో రోజు...**

చివరి రోజు ప్రధాన వేదికపై జీఆర్కే?పోలవరపు సాంస్కృతిక సమితి హాస్యరథం సభ నిర్వహించింది. మంజులూరి కృష్ణకుమారి, గొల్ల నారాయణరావు తదితరులు పాల్గొన్నారు. రాత్రి జరిగిన ముగింపు సభలో విశ్రాంత ఐఏఎస్ అధికారి ఎం.డి.ఇంతియాజ్, గజల్ శ్రీనివాస్, జి.మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు. వివిధ పోటీల్లో గెలుపొందినవారికి బహుమతులు ప్రదానం చేశారు. 11 రోజుల పాటు పండుగ వాతావరణం సృష్టించిన పుస్తకాల పండుగ 12వ తేదీ ఆదివారం విజయవంతంగా ముగిసింది.

**పుస్తకావిష్కరణలు...**

తొలి రోజు జర్నలిస్టు ఎ.కృష్ణారావు రాసిన 'భారతీయ సాహిత్య నిర్మాతలు?పాములపర్తి వెంకట నరసింహారావు' పుస్తకాన్ని పవన్ కళ్యాణ్ ఆవిష్కరించారు. రెండో రోజు రైటర్స్ స్టాల్‌లో కవి, రచయిత శర్మ సీహెచ్., రచించిన 'శర్మ శతకము' గ్రంథాన్ని సాహితీవేత్త డాక్టర్ గుమ్మా సాంబశివరావు ఆవిష్కరించారు. ఆ తర్వాత ప్రతిరోజూ పుస్తకావిష్కరణలు జరిగాయి. జర్నలిస్ట్ రెంటాల జయదేవ రచించిన 'ఫస్ట్ రీల్' పుస్తకాన్ని సినీ ప్రముఖుడు తమ్మారెడ్డి భరద్వాజ ఆవిష్కరించారు. డి.పాపారావు రచించిన 'మానవాళికి మహోదయం-అంతం కాదిది ఆరంభం' పుస్తకాన్ని జర్నలిస్ట్ ఎస్.వెంకట్రావు ఆవిష్కరించారు. జస్టిన్ హెచ్.ఎన్. నాగమోహన్‌దాస్ రచించిన 'రాజ్యాంగం మనకేమిచ్చింది' పుస్తకాన్ని కేరళ పూర్వ విద్యాశాఖ మంత్రి ఎం.ఎ.బేబి ఆవిష్కరించారు. సీనియర్ జర్నలిస్ట్ ఆకుల అమరయ్య రచించిన 'భారతీయ జర్నలిజం ధ్రువతార మానికొండ చలపతిరావు' పుస్తకాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణతోపాటు పాత్రికేయ మిత్ర బృందం ఆవిష్కరించింది. వి.రామ్‌భూపాల్ రచించిన 'రైతును ముంచుతున్న పాలకుల విధానాలు, అసమానతలు, ఆర్థిక విధానాలు, విద్వేష రాజకీయాలు' పుస్తకాన్ని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బి.వి.రాఘవులు ఆవిష్కరించారు. ఇదే రోజు సుప్రసిద్ధ కవి ఖాదర్ మొహియుద్దీన్ చేతుల మీదుగా పి.శ్రీనివాస గౌడ్ రచించిన 'అంబపలుకు' కవితా సంపుటిని ఆవిష్కృతమైంది. గుడిపాటి వెంకటచలం రచించిన నాలుగు నవలలను పునర్ముద్రించి ఆవిష్కరించారు. గంటా సత్యకుమార్ రచించిన 'విశ్వం' పుస్తకాన్ని ఎమ్మెల్యే మండలి ఆవిష్కరించారు. నక్కా విజయరామరాజు రచించిన 'మా హాస్టల్ కథలు' కథా సంపుటిని అరసం అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ ఆవిష్కరించారు. రచయిత జమ్ముల చౌదరయ్య రచించిన 'జీవితం? ఒక అవగాహన' పుస్తకాన్ని గొల్ల నారాయణరావు ఆవిష్కరించారు. మరో వేదికపై 'ఫలహారాల చెట్టు', 'పుత్తడి బొమ్మతో స్నేహం', 'మాట్లాడే గడియారం' వంటి అనువాద బాల సాహిత్య పుస్తకాలు ఆవిష్కృతమయ్యాయి. ఇంకా నరసింహరాజు విరచిత 'తల్లడిల్లే తల్లివేరు' ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు విరచిత 'భారత రాజ్యాంగం', రాంప్రదీప్ రాసిన 'విస్మృత మహనీయులు' పుస్తకాలను ఆవిష్కరించారు. వీటితోపాటు రుగ్వేద యదార్థ దర్శనం, ఈ గులాబీకి ముళ్లు లేవు, వెలుతురు, స్వప్నసాగరం పుస్తకాలు ఆవిష్కృతమయ్యాయి.

-చెన్నాప్రగడ వీఎస్ఎన్ శర్మ
సీనియర్ జర్నలిస్ట్
చరవాణి: 9440587567



ఆంగ్ల పుస్తకాలను పరిశీలిస్తున్న యువత





అచ్చంగా రచయితల కోసం ఏర్పాటుచేసిన స్టాల్

# 'స్టార్టప్'లతో భారత సమగ్ర సుస్థిరాభివృద్ధి !

అత్యాధునిక డిజిటల్ ప్రపంచంలో 3వ అతి పెద్ద 'స్టార్టప్‌ల హబ్(అంకుర కేంద్రం)'గా యువభారతం అవతరించడం హర్షదాయకం. ఒక సరి కొత్త ఆలోచనతో మొదలు పెట్టే వినూత్న వ్యాపార ప్రారంభ దశను స్టార్టప్ అని పిలుస్తారు. స్టార్టప్ అనే పదానికి అంకురార్పణ, ఉపారంభం, నాంది, శ్రీకారం, సమారంభం అనే అర్థాలు ఉన్నాయి. సాధారణంగా ప్రారంభ దశలో ఉన్న వాణిజ్య సంస్థలను స్టార్టప్‌లు లేదా అంకుర సంస్థలుగా పిలుస్తాం. స్టార్టప్‌లను ప్రారంభించడం అంత సులభమేమీ కాదు. మన వినూత్న ఆలోచనలు కార్యరూపం దాల్చడానికి కంపెనీ స్థాపన, నిధుల సేకరణ, మౌళిక వనరులు/వసతుల కల్పన, మానవ వనరులు, సరైన శ్రమ అవసరం అవుతాయి. 2023 నాటికే కేంద్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన 1,15,000 స్టార్టప్‌లు దేశవ్యాప్తంగా టెక్నాలజీ, వ్యవసాయం, విద్య, ఆరోగ్య సంరక్షణ లాంటి రంగాల్లో ప్రారంభం కావడంతో రానున్న రోజుల్లో యువభారత స్టార్టప్‌ల ఎకోసిస్టమ్ మరింత పుంజుకోనున్నట్లు నిపుణులు అంచనా వేస్తున్నారు.

**ఆత్మ నిర్భర భారతానికి వెన్నెముక:**

"ఆత్మ నిర్భర భారత్" నిర్మాణానికి వెన్నెముక వలె అన్ని రంగాల్లో స్టార్టప్‌లు ప్రారంభం కావాలని 2022లో మన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ భావించి ప్రారంభించిన 'జాతీయ స్టార్టప్ దినోత్సవం' ప్రతి ఏట 16 జనవరి రోజున నిర్వహించడం ఆనవాయితీగా మారింది. స్టార్టప్‌ల స్థాపనలు పుంజుకున్నపుడు దేశ ఆర్థికాభివృద్ధి, ఉద్యోగ ఉపాధుల కల్పన, అంకుర సంస్థల ప్రగతి, స్వయం సమృద్ధ భారతం, ఆత్మనిర్భర భారత్, 2047 నాటికి వికసిత్ భారత్ కలల సాకారం, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు చొరవ తీసుకోవడం లాంటి పలు ప్రయోజనాలు కలుగుతాయి.

**'స్టార్టప్ ఇండియా స్కీమ్' ప్రారంభం:**

దేశాభివృద్ధిలో స్టార్టప్‌ల అమూల్య పాత్రను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం 2016లోనే " స్టార్టప్ ఇండియా స్కీమ్"ను తీసుకురావడం జరిగింది. ఈ పథకం ద్వారా స్టార్టప్‌లకు సులభ రిజిస్ట్రేషన్ల వ్యవస్థ, పన్నుల్లో రాయితీలు, ఆర్థిక చేయూత, సులభ వ్యాపార విధానాలు, ఇన్నొవేషన్‌కు ఊతం ఇవ్వడం, పాలసీలను రూపొందించడం, పరిశ్రమలు- అకడమియా అనుసంధానాలు, ఇంక్యుబేషన్ మెంటర్‌షిప్ లాంటి పలు సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తున్నది. నేడు భారత్‌లో ఉన్న 1.15 లక్షల రిజిస్టర్డ్ స్టార్టప్‌లతో 100 యూనికార్న్స్, వివిధ రంగాలకు విస్తరణలు, మార్గ్ ప్లాట్‌ఫామ్, క్రెడిట్ గ్యారంటీ స్కీమ్, ఫండ్ ఆఫ్ ఫండ్స్ లాంటి ప్రోత్సాహక పథకాలు తీసుకురావడం సంతోషదాయకం.

నేటి జాతీయ స్టార్టప్ దినోత్సవ వేదికగా పరిశోధనలకు ప్రేరణ, గ్రామీణాభివృద్ధి దిశగా స్టార్టప్‌ల స్థాపనలు, అంతర్జాతీయ సహకారం, టెక్నాలజీ అభివృద్ధి, సమస్యల పరిష్కారం, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు అనువైన వాతావరణ కల్పన, డిజిటల్ రంగంలో సానుకూల మార్పులు లాంటి అత్యవసర సౌకర్యాలు సత్వరమే అందుబాటులోకి తేవాలని కోరుకుందాం. యువ భారత్ అంటే స్టార్టప్‌ల పర్యాయపదంగా నిలవాలని ఆశిద్దాం. ప్రతి ఒక్క స్టార్టప్, వినూత్న ఆలోచన ప్రగతికి వేసిన మరో ముందడుగు అని భారత యువత నమ్మాలి.

(16 జనవరి "జాతీయ స్టార్టప్ దినోత్సవం" సందర్భంగా)



డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# పండుగ వేళ పందుల పోటీలు..

**-ఉభయ గోదావరి జిల్లాల్లో జోరుగా బెట్టింగ్ లు**
**-పోటీలు నిర్వహించడం ఆచారమన్న ఎరుకల సంఘం**
**-మూడు విభాగాల విజేతలకు బహుమతులు ప్రదానం**

అమరావతి, జనవరి 15: కోళ్ల పందేలతో పాటు, గుండాట, పేకాట, లాటరీ, జూదం తదితర పోటీలు విచ్చలవిడిగా జరిగాయి. ఈ పోటీలకు తామేమి తీసిపోమంటూ ఆంధ్రప్రదేశ్ పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం కుంచనపల్లి గ్రామంలో పందుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు ఆయా జిల్లాల నుంచి పందెంరాయుళ్లు తమ పందులతో గ్రామానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా బెట్టింగ్ లు కూడా కొనసాగాయి.

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పందుల మధ్య పోటీలు రసవత్తరంగా జరిగాయి. నెల్లూరు జిల్లా బుచ్చి గ్రామం, కోనసీమ జిల్లా వలస గ్రామం మధ్య పోటీలు నిర్వహించగా బుచ్చి గ్రామానికి చెందిన పంది విజేతగా నిలిచింది. పశ్చిమగోదావరి జిల్లాలో తిరుపతిపాడు, కొమ్ముగూడెం గ్రామాల పందుల మధ్య పోటీ నిర్వహించగా, తిరుపతిపాడుకు చెందిన పంది విజేతగా రెండవ స్థానంలో నిలిచింది.

ఇక తూర్పుగోదావరి జిల్లా మండపేట, నిడదవోలు గ్రామాలకు చెందిన పందుల మధ్య పోటీ నిర్వహించగా మండపేట గ్రామానికి చెందిన పంది విజయం సాధించి మూడో స్థానంలో నిలిచింది. పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం, తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు గ్రామాల మధ్య పోటీ జరగ్గా తాడేపల్లిగూడెం విజయం సాధించింది.

ఈ సందర్భంగా పోటీ నిర్వాకుడు సింగం సుబ్బారావు మాట్లాడుతూ ప్రతి సంక్రాంతి పండుగకు ఎరుకల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పందుల పోటీలు నిర్వహించడం తమ తరతరాల ఆచారమని తెలిపారు. కత్తులు కట్టని, ప్రాణహాని లేని ఈ పోటీలు నిర్వహించుకోవడానికి ప్రభుత్వం నుంచి వారికి పూర్తిస్థాయిలో మద్దతు కావాలని ఆయన కోరారు.

## భారతీయ ఎన్నికలపై కామెంట్ చేసిన ఫేస్‌బుక్ సీఈవో మార్క్ జుకర్‌బర్గ్

**-జుకర్‌బర్గ్తరపున మెటా సంస్థ క్షమాపణలు**

న్యూఢిల్లీ జనవరి 15 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: భారతీయ ఎన్నికలపై కామెంట్ చేసిన ఫేస్‌బుక్ సీఈవో మార్క్ జుకర్‌బర్గ్తరపున మెటా సంస్థ క్షమాపణలు చెప్పింది. కోవిడ్19 సమయంలో సరైన రీతిలో చర్యలు తీసుకోని ప్రభుత్వాలు కూలినట్లు జుకర్‌బర్గ్ ఇటీవల కామెంట్ చేశారు. అయితే ఆ దేశాల్లో భారత్ కూడా ఉన్నట్లు జుకర్‌బర్గ్ పేర్కొన్నారు. ఆ వ్యాఖ్యల పట్ల మెటా సంస్థ ఇవాళ సారీ చెప్పింది. మెటా ఇండియా పబ్లిక్ పాలసీ వైస్ ప్రెసిడెంట్ శివనాథ్ తుక్రల్ తన ఎక్స్ అకౌంట్‌లో జుకర్‌బర్గ్ తరపున క్షమాపణలు చెప్పారు.కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ఆ సారీ స్టేట్మెంట్‌ను ట్యాగ్ చేశారాయన. కోవిడ్ తర్వాత అనేక దేశాల్లో జరిగిన ఎన్నికల్లో అధికార పార్టీలు ఓటమి చవిచూశాయన్న విషయం అనేక దేశాల్లో నిజమైందని, కానీ ఇండియా విషయంలో అది నిజం కాలేదన్నారు. ఆ తప్పు పట్ల తాము క్షమాపణలు చెబుతున్నట్లు వెల్లడించారు. మెటా సంస్థకు ఇండియా చాలా కీలకమైన దేశమని పేర్కొన్నారు.మరో వైపు మెటా సంస్థకు సమ్మన్లు జారీ చేయనున్నట్లు ఐటీ, కమ్యూనికేషన్స్ పార్లమెంటరీ కమిటీ చైర్మన్ నిశికాంత్ దూబె తెలిపారు. కోవిడ్ తర్వాత సుమారు 20 దేశాల్లో ఆయా పార్టీలు అధికారాన్ని కోల్పోయాయి. కానీ ఇండియాలో మాత్రం అలా జరగలేదు.

## ఎట్టకేలకు తీవ్ర ప్రతిఘటనల మధ్య దక్షిణ కొరియా అధ్యక్షుడు అరెస్టు

సియోల్ జనవరి 15 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: అభిశంసనకు గురైన దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్‌ను పోలీసులు ఎట్టకేలకు అరెస్టు చేశారు. తీవ్ర ప్రతిఘటనల అనంతరం యోల్‌ను అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు ప్రకటించారు. దీంతో దక్షిణ కొరియా చరిత్రలో అరెస్టయిన తొలి అధ్యక్షుడిగా యోల్ నిలిచారు. అంతకుముందు బుధవారం తెల్లవారుజామున సియోల్‌లోని అధ్యక్ష భవనం వద్ద నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. యోల్‌ను అరెస్టు చేసేందుకు 3 వేల మందికిపైగా పోలీసులతో యాంటీ కరెప్షన్ ఇన్వెస్టిగేటర్లు ఆయన అధికార నివాసానికి చేరుకున్నారు. అయితే వారిని అధికార పార్టీకి చెందిన నాయకులు, యోల్ మద్దతుదారులు, వ్యక్తిగత సిబ్బంది, సైన్యం పోలీసులతోపాటు విచారణ అధికారులను అడ్డుకునేందుకు ప్రయత్నించారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. తీవ్ర ప్రతిఘటనల నడుమ అధ్యక్ష భవనంలోకి ప్రవేశించిన అధికారులు యోల్‌ను అరెస్టు చేశారు. ఓ ఎరుపు రంగు బస్సులో ఆయనను అక్కడి నుంచి తరలించారు. ఆయన్ని ఎక్కడి తీసుకెళ్లారనే విషయాన్ని అధికారులు వెల్లడించలేదు. అయితే యోల్‌ను గవాచియాన్‌లోని కరప్షన్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్ (అమో) కార్యాలయానికి తరలించే అవకాశం ఉన్నది. అక్కడ మార్షల్ లా విధింపు కేసులో విచారణ జరుపనున్నారు. అరెస్టు వారెంట్ నేపథ్యంలో 48 గంటలపాటు ఆయన్ని అదుపులో ఉంచుకునే అధికారం సీఐవోకు ఉంటుంది.సెంబర్ 3న దేశంలో ఎమర్జెన్సీ మార్షల్ లా విధించిన విషయం తెలిసిందే. దీంతో ఆయనపై నేషనల్ అసెంబ్లీ 204-85 ఓట్లతో అభిశంసన తీర్మానాన్ని ఆమోదించింది. మార్షల్ లాను ప్రకటించిన కేసులో విచారణకు సహకరించకపోవడంతో ఆయనపై అరెస్టు వారెంటు జారీ అయింది. ఈ నేపథ్యంలో ఆయనను అరెస్టు చేసేందుకు అధికారులు ఈ నెల 3 విఫల యత్నం చేశారు. తెల్లవారుజామునే అధ్యక్ష భవనానికి చేరుకున్న అధికారులను సైన్యంతోపాటు ఆయన వ్యక్తిగత సిబ్బంది అడ్డుకున్నారు. సుమారు ఆరు గంటల పాటు.. అధ్యక్షుడి భద్రతా సిబ్బందితో పోలీసులు వాగ్వాదానికి దిగారు. చివరకు అరెస్టును వాయిదా వేసుకున్న పోలీసులు వెనక్కి మళ్లారు.


కిన్నెర ఆర్ట్ థియేటర్స్
ఆహ్వానం
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారు
డా॥ కె.వి. రమణ, ఐఎఎస్(రి) గారి 73వ జన్మదిన సందర్భంగా
హరికథా మహోత్సవాలు
2025 ఫిబ్రవరి, 1 నుండి 7వ తేదీ వరకు, ప్రతి రోజు సా॥ 6 గంటలకు
శ్రీ శృంగేరి శంకర మఠం, నల్లకుంట, హైదరాబాద్

ప్రారంభోత్సవం
01-02-2025 శనివారం : శ్రీమతి ముప్పవాటి అరుణాదేవి (హైదరాబాద్) భాగవతారిణి గారిచే 'నర్తనశాల' హరికథాగానం
02-02-2025 ఆదివారం : శ్రీ పాల రామాంజనేయులు (భీమవరం) భాగవతార్ గారిచే 'సుందరకాండ' హరికథాగానం
03-02-2025 సోమవారం : శ్రీయడవర్తి రమణయ్య (ప్రొద్దుటూరు) భాగవతార్ గారిచే 'భక్త మార్కండేయ' హరికథాగానం
04-02-2025 మంగళవారం : డా॥ వై.వేంకటేశ్వర్లు (తిరుపతి) భాగవతార్ గారిచే 'శ్రీనివాస కళ్యాణం' హరికథాగానం
05-02-2025 బుధవారం : శ్రీ గద్వాల కాశీవిశ్వనాథ్ (జోగులాంబ, గద్వాల్ జిల్లా) భాగవతార్ గారిచే 'పార్వతీ కళ్యాణం' హరికథాగానం
06-02-2025 గురువారం : శ్రీ అనగాని నరసింహ (వరంగల్) భాగవతార్ గారిచే 'రుక్మిణీ కళ్యాణం' హరికథాగానం
07-02-2025 శుక్రవారం : శ్రీ బుర్రా పద్మనాభ శర్మ (విజయవాడ) భాగవతార్ గారిచే 'భక్త పోతన' హరికథాగానం

వాద్య సహకారం:
వయొలిన్ : శ్రీ ధూళిపాళ శ్రీనివాస శాస్త్రి - మృదంగం : శ్రీ రాయప్రోలు సుధాకర్
డా॥ ఆర్. ప్రభాకరరావు, ఐపిఎస్ (రి), అధ్యక్షులు మద్దాళి రఘురామ్, కార్యదర్శి




సాహిత్యం, సామాజిక నిర్వహిస్తున్న
## 'బుధవారం బాద్షా' పోటీ ఫలితాలు



అడ్మిన్: రమాదేవి
8985613123

నిర్వహణ:
శ్రీమతి సత్య నీలిమ



### బాల్యపు జ్ఞాపకాలు

రారమ్మని పిలుస్తున్నాయి
కమ్మని నా బాల్యపు జ్ఞాపకాలు
అమ్మ ఒడిలా ఆప్యాయతల్ని
పంచుతున్నాయి.
గోరుముద్దలు తినిపించేవేళ
తలుపుచాటున నక్కి
అమ్మతో దోబూచులాడిన వైనం .
నాన్న వీపు ఎక్కి
చల్ చల్ గుర్రం అంటూ
ఆటలాడిన మురిపెం .
అక్కచేయి పట్టి చెమ్మచెక్కలాట
ఆడిన ఆనందం
అన్న చేతిలో బొమ్మ లాక్కుని
తన్నులుతిన్న ఉడుకుమోతుతనం.
తాతయ్య ఒడిలో చేరి
కమ్మని కథలు విన్న జ్ఞాపకం
అమ్మమ్మ కళ్లజోడు దాచేసి
అల్లరి చేసిన చిలిపితనం
ఇలా ఎన్నో ,ఎన్నెన్నో
మరపురాని మధుర జ్ఞాపకాలు
మరచిపోలేని తియ్యనైన
ఆనందాలు
మొదటిసారి అనిపించింది
ఏ కాలయంత్రమో ఉంటే బావుండునని
వెనక్కి వెళ్లి రావచ్చని
ఏ మాయా మంత్రమో నేర్చి ఉంటే
కోరుకున్నది వచ్చునని.
వెళ్ళలేను వెనక్కి
నా వారసత్వపు సంపదలో
చూసుకుంటాను నా బాల్యస్మృతి

-కొలచన విజయ భారతి
హైదరాబాద్

### నా ప్రియ నెచ్చెలి

నా జీవితేశ్వరీ
నీ జ్ఞాపకాల ఒడిలో ఇపుడు
సేద తీరుతూ ఉన్నాను
నీ తలపులే నిరంతరం
నా మనసులో మెదులుతున్నవి.
మన పెళ్ళి నాటి నుండి
జరిగిన సంఘటనలన్నీ
నా మదిలో మెదులుతూ
పాత రోజులు యాదికివచ్చె.
నీకు మూడు ముళ్ళు వేశాను
నీతో ఏడడుగులు నడిచాను
ఆనందమయ మన సంసారం
స్వర్గసీమను తలపించెనుగా.
నలుగురు పిల్లలకు జన్మనిచ్చి
నాకు తోడు నీడగా నిలిచావు
పిల్లలను తీర్చిదిద్ది బాధ్యతలు
అప్పగించి ఆనందం అందించావు.
హాయిగా రామకృష్ణ అనుకునే
సమయంలోనే ఆగమైతివేల చెలీ
ఒకరికొకరం తోడునీడగా ఉందామంటే
ఒంటరిగానే వెళ్ళిపోయినావు.
మన సంసార నావను నీవు
నాతో కలిసి నడిపించినావు
ఈ జీవిత గమనంలో నన్ను
ఒంటరిని చేసి వెళ్ళిపోయావు.

-అక్కి నర్సింలు గౌడ్
రంగారెడ్డి జిల్లా

### జ్ఞాపకాల ఒడిలో

అమ్మ వడిలో ఆనందం
మరచి పోలేని మధురాను బంధం
నాన్న వెంట వేసిన అడుగులు
నా అభివృద్ధికి పూల బాటలు.
రెక్కలొచ్చిన పక్షిలా
ఎగురుతుంటె స్వేచ్ఛకు
రారాజును నేనేయనే ఆనందం
అంటిపెట్టుకొని ఉన్న మధుర జ్ఞాపకం
అది ఎక్కించింది ఉన్నత శిఖరం.
పచ్చని పంట పొలాల్లో
పారె పిల్లకాలువల వెంట
పరుగులు తీస్తు పరవశించే
స్వర్ణయుగం నా బాల్యం.
కల్మషములేని స్నేహం
కలిసి ఆడే ఆ తరుణం
కమ్మగ కూసే కోయిల గానం
రమ్మని పిలిచే ప్రేమ బంధం
రావాలి మళ్లి మళ్లి అదే బాల్యం.
అలసట లేని ఆటలు
అందరిని కలిపే బాల్యం
బాధలను మరపించే అనురాగం
ఆత్మీయత బీజాలు
పోసిన బాల్యం
మరచి పోలేని మధుర జ్ఞాపకం
ఆ నా బాల్యం..

-డా.బి.సుధాకర్, సిద్దిపేట

### అల్లుకున్న పూల పల్లకి!

అలల తరంగాలల్లో పడి లేచే కెరటంలా
సుఖ దుంఖాల సుడిగుండాల్లో చెదిరిన
తీయని ఆశల స్మృతి కౌగిలిలో
ఏవో! ఊసుల బాసలు! తీరం చేరని వ్యథలెన్నెన్నో!.
మమతానురాగాలను హృది స్పందనలో
గుండె నిండుగా దాచుకొన్న మమతల మాధుర్యాలు..
గాయాలై ఎద గదిలో అలజడి చేస్తుంటే
నిరాశతో నిండిన నిట్టూర్పులు స్మృతుల ఊసులతో
ముచ్చట్లు చెబుతూ..
అనుభవాలు అందంగా ఎద లోయల్లో తొంగి చూస్తుంటే
అవధులు లేని ఆనందాలను పంచిన స్మృతి గేయాలు..
లక్ష్యం కోసం ఓటమి పాలయినా మరల మరల సాధనతో
చేయందించిన విజయాలు హృది పొదిలో నిక్షిప్తమైన నిధులు..
చేయి చేయి కలుపుతూ.. చిరునవ్వుల అల్లర్లను చిందిస్తూ
కలిసి మెలిసి తిరిగిన అనురాగాల రాగాలను మేల్కొలిపే
స్నేహ బంధాల స్మృతులు
అవధులు లేని ఆటల పాటల అచ్చట్లూ ముచ్చట్లతో కాలం తెలియని
మధురానుభూతులు మనసులు కలిసిన మధుర జ్ఞాపకాలు..
వెలకట్టలేని అమూల్యమైన నిధులు
బాధల్లో సేదతీర్చే తీయని ఊసుల గనులు తీయని స్మృతులు..

-డా.పద్మావతి పి హైదరాబాద్

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: BAISA DEVADAS.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.